క్లుప్తంగా

ఐదు వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనాలను పోలీసుస్టేషన్‌లో ఉంచిన దృశ్యం

అమరాపురం: మండలంలో అనుమతి లేకుండా అక్రమంగా తిరుగుతున్న ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు హిందూపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. బుధవారం ఆయన అమరాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాక్టర్, బొలెరో, టాటా ఏసీ, బోరు బావుల లిఫ్టింగ్ వాహనాలకు సరైన రికార్డులు లేకపోవడంతో వాహన యాజమానులకు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. లైసెన్స్ లేని, ప్రభుత్వానికి పన్ను కట్టని వాహనాలు రోడ్ల మీద తిరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. వాహనాదారులు రికార్డులను పక్కగా ఉంచుకోవాలని సూచించారు. కర్ణాటక బార్డర్ ఉండటంతో చాలామంది రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సవిత ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విగ్రహ ప్రతిష్టకు రూ.2 లక్షల విరాళం



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టకు విరాళం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని దండురోడ్డులో ఆంజనేయస్వామి మాన్యంలో నూతనంగా 27 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మేళాపురంలోని చౌడేశ్వరీకాలనీలో నివాసమున్న నరసింహారెడ్డి కుమారులు విగ్రహ ప్రతిష్టకు రూ.2,00,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందించారు.

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం



గంగ పూజ నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం టౌన్: స్థానిక 14వ వార్డులోని పోచంపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త పైప్‌లైన్‌ను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి వద్ద గంగ పూజను నిర్వహించారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు సక్రమంగా నీటిని అందించాలన్న సంకల్పంతో పెన్నానది నుంచి నూతనంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించామన్నారు. అనంతరం మున్సిపల్ ఏఈ సురేష్, ఫిట్టర్ సిద్దప్పను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సత్వరమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ ప్రసాదరావు

పరిగి: పేదలందరికీ ఇళ్లు పథకం కింద మండలంలోని లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశారని, ఇంటి నిర్మాణాలను సత్వరమే చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం ఆయన పరిగి మండల స్పెషలాఫీసర్‌గా బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో పాటు సచివాలయాల సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా మంజూరుతో పాటు నిర్మాణ పనులు మొదలు పెట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ గడువులోపే నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, హౌసింగ్ ఏఈ సునీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



పెనుకొండ: వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



రొళ్ల: 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, తదితరులు



హిందూపురం: అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్సీ ఇక్బాల్, తదితరులు

- అర్హులకు సంక్షేమ ఫలాలు చేర్చడంలో వలంటీర్లే కీలకం
- ఇదే స్ఫూర్తిని కొనసాగించండి
- ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

పెనుకొండ: 'సేవకులారా మీకు వందనం .. మీ సేవలు స్ఫూర్తిదాయకం.. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో పని చేసి మళ్లీ ఈ రాష్ట్రానికి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ సమీపంలోని సెంట్రల్ స్కూల్ ఆవరణలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సేవా మిత్ర, సేవా రత్న పురస్కారాలను వలంటీర్లకు అందించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వలంటీర్లు పట్టుగొమ్మ అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించడంలో వలంటీర్లు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల మంది వలంటీర్లు మహా సైన్యంలా పేదలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని పనులున్నా సకాలంలో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి ప్రభుత్వానికి మంచి పేరును తీసుకువస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే వలంటీర్, సచివాలయ వ్యవస్థలను రద్దు చేయడం ఖాయమన్నారు. అమ్మఒడి, పింఛన్‌లు, నేతన్న నేస్తం, రైతు భరోసా, జగనన్న చేదోడు, ఇతర పథకాలను చంద్రబాబు కనుమరుగు చేస్తారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలతో వలంటీర్లు ప్రతిరోజూ మమేకం అవుతూ ప్రజలకు జగనన్న చేసిన మేలును వివరించాలని సూచించారు. అలాగే చంద్రబాబు అధికారంలోకి వస్తే జరిగే నష్టాన్ని వివరించాలన్నారు. కరోనా, వరదల సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారన్నారు. సమావేశంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్ రెడ్డి, గృహసారథుల కన్వీనర్ రాము , కౌన్సిలర్లు తయూబ్, రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, శేషాద్రి, సద్దాం, కోఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, వెంకటరామిరెడ్డి, ముహీబా తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు చరిత్రలో నిలిచిపోతాయని ఎమ్మెల్యే తిప్పేస్వామి కొనియాడారు. బుధవారం పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎంపీడీఓ రామారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాల అందిస్తున్నామన్నారు. గత నాలుగేళ్లుగా ఎక్కడా కూడా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో 8,490 మంది వలంటీర్లు నిరంతరం తమ సేవలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి కూడా అండగా ఉండి ప్రభుత్వ పథకాలను అందించడంతో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సన్మానించి వారికి అవార్డులతో సత్కరించే కార్యక్రమాన్ని చేపట్టడం హర్షణీయమన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి అండా ఉండి మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వలంటీర్లను ప్రత్యేకంగా వేదికపైకి పిలిచి పూలమాల, శాలువతో పాటు మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, తహసీల్దార్ హసీనాసుల్తానా, మండల పరిషత్ ఏఓ ఆరాధ్య, ఈఓఆర్డీ కృష్ణప్ప, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, ఎంపీటీసీలు సౌమ్య, లింగరాజు, జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించడంలో వలంటీర్ల సేవలు కీలకమని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీఓ నరేంద్ర అధ్యక్షతన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లందరికీ నిజంగా వందనమన్నారు. గత టీడీపీ పాలనలో పింఛన్, రేషన్‌కార్డు, ఇంటి స్థలం ఇలా ఏ లబ్ధి పొందాలన్నా టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ చుట్టూ తిరిగి లంచాలు ఇవ్వందే లబ్ధిచేరేది కాదు. ఇప్పుడు ఎవరి సిఫార్సులు లేకుండానే వలంటీర్ల ద్వారా పారదర్శకంగా ఇంటికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. వలంటీర్ల ద్వారా నాలుగేళ్లలో ఒక్క హిందూపురం మండలంలో అమ్మఒడి, ఆసరా, చేయూత, చేదోడు, జగనన్న తోడు, కాపు నేస్తం, రైతు భరోసా ఇలా 23 పథకాల ద్వారా 55,568 మందికి రూ.147.66 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. అన్ని అర్హతలు ఉండి లబ్ధిచేకూరని కుటుంబాలను ప్రతిపక్ష నాయకులు కూడా చూపలేదంటే ఎంత పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని అందరూ గుర్తించాలన్నారు. 1వ తేది తెల్లవారముక మునుపే చలి, వర్షం ఇలా ఎన్ని అవంతారాలు వచ్చినా అవ్వతాతలకు ముంగిట నిలిచి పింఛన్ అందిస్తూ వారు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ హ్యాట్సాఫ్ చెప్పాల్సిందేనన్నారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించి అవార్డులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కొందరు వలంటీర్లు మాట్లాడుతూ ప్రజల ఇళ్లకు వెళ్లి పింఛన్, ఇతర ప్రయోజనాలు అందిస్తున్నప్పుడు వారు చూపే ఆప్యాయత, సంతోషం వెలకట్టలేనిదన్నారు. ఇలా ప్రజలకు తమవంతు సేవ చేయడానికి జగనన్న అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, సర్పంచ్‌లు ఆనంద్, భాగమ్మ, ఎంపీటీసీ సభ్యులు జగన్నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రాము, బసిరెడ్డి, గిరిష్, మల్లేష్, నరేంద్ర,రామాంజి, ఆనంద్‌రెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



ఎగువ రామగిరిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: 'ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఏఆర్ రొప్పం సచివాలయం పరిధిలోని ఎగువ రామగిరి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధితో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి పొందిన పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశ్వీదించి మళ్లీ సీఎంగా చేసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ కుంటుంబానికి ఎంతగానో భరోసా ఇచ్చాయని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని ఉద్యోగులకు సూచించారు.

పనులను వేగవంతం చేయండి

మండలంలోని గ్రామాల్లో వివిధ పథకాల కింద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు కోరారు. అలాగే గడప గడపకూ కార్యక్రమం పూర్తి అయిన సచివాలయాలకు మంజూరైన నిధులతో గుర్తించిన పనులను చేపట్టాలని ఎంపీడీఓ సోనిబాయికి సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పరిపాలనలోనే 98 శాతం హామీలు అమలు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ లబ్ధిని చేకూర్చాలంటే మరోసారి ప్రజలు ఆశీర్వదించి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌దేనని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, సర్పంచ్ గీత, జెడ్పీటీసీ సరోజమ్మ, వక్కలిగ డైరెక్టర్ నాగరాజు, ఎంపీటీసీ కామరాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, విశ్వనాథ్, మోహన్, శివప్ప, రంగనాథ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



చెరువులో జరిగిన పనులను పరిశీలిస్తున్న పీడీ రామాంజనేయులు

మడకశిరరూరల్: మడకశిర క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి మరింతగా కూలీల సంఖ్యను పెంచాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని డ్వామా పీడీ రామాంజినేయులు సిబ్బందిని హెచ్చరించారు. ఆయన బుధవారం మడకశిర మండలం ఆమిదాలగొంది చెరువులో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. ఎంపీపీ కవిత, నాయకులు జమ్మానిపల్లి మూర్తి, సత్యనారాయణ, ఏపీడీ జయసింహా పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారం మరువలేనిది



సహచర ఉద్యోగులతో తహసీల్దార్ సుజాత

పావగడ: స్థానిక విధాన సభ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేసిన సిబ్బంది సహకారం అభినందనీయమని తహసీల్దార్ కేఎస్ సుజాత ప్రశంసించారు. స్థానిక తుమకూరు రోడ్డులోని డా బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన అభినందన సభలో తహసీల్దార్.. ఎన్నికల ప్రక్రియకు సహకరించిన పోలీసులు, ఇతర విభాగాల వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సాగుకు సన్నద్ధం

లేపాక్షి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలం వ్యాప్తంగా వ్యవసాయానికి రైతులు సిద్ధం అవుతున్నారు. వ్యవసాయ పొలాల్లో కంపచెట్లు తొలగించడం , ఎరువులు వేయడం, ట్రాక్టర్లు, ఎద్దుల మడకలతో దున్నడంపై అన్నదాతలు నిమగ్నమయ్యారు. గత ఏడాది 1610 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసారని, అయితే ఈ ఏడాది వర్షాలు కురుస్తుండటంతో వేరుశనగ సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాదికి 1999 క్వింటాళ్ల వేరుశనగ అవసరమని ప్రతిపాదనలు పంపగా ఇప్పటి వరకు 1002 క్వింటాళ్లు ఆర్‌బీకే కేంద్రాలకు చేరాయన్నారు.



శిరివరంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

29 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

హిందూపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో ఈ నెల 29 నుంచి జూన్ 5 వరకూ పాలీసెట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాలీసెట్ ర్యాంకర్లకు 25 నుంచి జూన్ 1వ తేదీ లోపు https://appolycet.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు. ర్యాంకుల వారీగా ఈనెల 29 నుంచి జూన్ 5 వరకు ధ్రువ పత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. కౌన్సిలింగ్‌కు పాలీసెట్ ప్రాసెసింగ్ ఫీజు రసీదు, ఏపీ పాలీసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా లేదా దానికి తత్సమానమైన ఒరిజినల్ లేదా ఇంటర్నెట్ మార్కుల జాబితా, టీసీ, 6 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, 1 జనవరి 2020 తరువాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, 2023 -24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు (ఓసీ అభ్యర్థులు) ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు చేయాలన్నారు. జూన్ 7వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందన్నారు. ఎస్టీ అభ్యర్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంలో కౌన్సెలింగ్‌కి హాజరు కావాలన్నారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు (పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్) విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కేంద్రంలో హాజరై తమ ధ్రువపత్రాలు పరిశీలన చేసుకోవాలని సూచించారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: మణిపూర్‌లో క్రైస్తవులు, మైనార్టీలపై జరుగుతున్న మారణ హోమాన్ని ఆపడంతో పాటు కేంద్ర ప్రభుత్వం వారిని రక్షించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దాదాపు 200కు పైగా క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ధ్వంసం చేయడంతో పాటు 1700 గృహాలు అగ్నికి ఆహుతి చేశారన్నారు. వందలాది క్రైస్తవులు మారణహోమంలో మరణించటం, వేలాది ప్రజలు స్వస్థలాలు విడిచి వలస పోవటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రతిపదికపై క్రైస్తవుల ప్రాణాలతో పాటు ప్రార్థనా స్థలాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఉమర్‌ఫారూక్, వినోద్ కుమార్, శివశంకర్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి కిట్లకు తోపులాట



కార్మికశాఖ కార్యాలయం వద్ద గుమిగూడిన కార్మికులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా 9, 10వ తరగతి చదువుతున్న కార్మికుల పిల్లలకు కార్మికశాఖ అందించే విద్యా సామగ్రి కిట్ల కోసం తోపులాట జరిగింది. స్థానిక పతంజలినగర్‌లోని కార్మికశాఖ కార్యాలయం వద్దకు వందలాది మంది కార్మికులు తరలి వచ్చారు. కార్మిక శాఖ అధికారి అబ్దుల్ రెహమాన్ సెలవుపై ఉండటంతో విద్యా సామగ్రి కిట్ల పంపిణీపై మిగతా ఉద్యోగులు నిర్ణయం తీసుకోలేదు. దీంతో కార్మికులు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో తోపులాట జరిగింది. అధికారులు వచ్చిన తర్వాత కిట్ల పంపిణీ జరుగుతుందని పోలీసులు నచ్చజెప్పడంతో కార్మికులు శాంతించారు.

వ్యక్తికి గాయాలు

సోమందేపల్లి: మండలంలోని చాలకూరులో రోడ్డు పక్కన కూర్చొని ఉన్న ఓ వ్యక్తిపై కారు దూసుకెళ్లడంతో అతను గాయాల పాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పెనుకొండ వైపు నుంచి హిందూపురం వెళుతున్న కారు ముందు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకు వెళ్లింది. ఇందులో భాగంగానే గ్రామానికి చెందిన నరసయ్యను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ విజయ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అమరాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులు 30 మంది, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 08 మంది పరీక్షలకు హాజరైనట్లు సీఎస్.మహేష్ తెలిపారు.

జీపు జాతాను జయప్రదం చేయండి

పెనుకొండ: నగర పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ 31 నుంచి జూన్ 6 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే నగర పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు రమేష్, బాబావలి, బాబా, చినవెంకటేష్, ముత్యాలు, నరసింహులు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు మేనేజర్‌గా ప్రహ్లాద

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్‌గా ప్రహ్లాద బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు పరిధిలోని ఖాతాదారులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం	35.0
పెనుకొండ	37.0
మడకశిర	35.0

సామాజిక అంశాలపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లిలో టింబక్టు ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు సామాజిక అంశాలపైన అవగాహన కల్పించారు. మేనరిక వివాహాలు, ఆరోగ్యం, చట్టాలు వంటి వాటిపై నాటిక ద్వారా అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో దుర్గా శక్తి సొసైటీ సభ్యులు ముంతాజ్, కవిత, రమీజ, లక్ష్మీదేవి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



నరసయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసయ్య (68) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ గ్రామానికి చేరుకొని నరసయ్య మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన కుమారుడు రామచంద్రను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, ఎంపీడీఓ నాగప్ప, డీలర్లు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, మురళి తదితరులు పాల్గొన్నారు.